నిమ్స్ మే ప్రహరీ చుట్టూ ఆక్రమణలు

- కాలిబాటలపై వెలుస్తున్న దుకాణాలు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు


నిమ్స్ మే ప్రహరీని ఆనుకొని వెలిసిన దుకాణాలు

బోరబండ, మే 12 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్-కార్మికనగర్ మార్గంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నిమ్స్ మేకు చెందిన ప్రహరీ చుట్టూ ఆక్రమణలు కొనసాగుతున్నాయి. కాలిబాటలో దుకాణాలు క్రమంగా పెరుగుతున్నాయి. అసలే ఇరుకైన మార్గంలో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలతో ఇబ్బంది పడుతున్న జనానికి ఈ దుకాణాల వల్ల మరింత అవస్థ పెరుగుతోంది.

పునరావాసం కల్పించిన ఎమ్మెల్యే

నిమ్స్ మే ప్రహరీకి ఆనుకొని మధురానగర్ పీఎస్ వద్ద నుంచి కార్మికనగర్ ఆటోస్టాండ్ వరకు, అటు నుంచి శ్రీరాంనగర్ వరకు కాలిబాటలపై ఇరువైపులా వందలసంఖ్యలో గుడిసెలు ఉండేవి. దశాబ్ధకాలంగా


నిమ్స్ మే కాలిబాటపై కొన్నేళ్ల క్రితం వేసిన గుడిసె(ఫైల్)

కాలిబాటలపై నివసించిన గుడిసెవాసుల వల్ల స్థానికులు, ప్రయాణికులు నానా అవస్థలు పడేవారు. స్పందించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గుడిసెవాసులతో పలుమార్లు చర్చించి వారందరినీ పునరావాసం కోసం ఒప్పించారు. అధికారులతో చర్చించి దాదాపు 300 మందికి సంగారెడ్డి జిల్లా బీరంగూడ వద్దనున్న నర్రెగూడెంలో పునరావాసం కల్పించారు. ఒక్కసారిగా గుడిసెలన్నీ తొలగడంతో నిమ్స్ మే ప్రహరీ ప్రాంతాలు విశాలంగా మారాయి.

గుడిసెలు తొలగించాక..

గుడిసెలను తొలగించిన తర్వాత భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రహదారులు మరింత విశాలంగా ఉండేలా నిమ్స్ మే స్థలాల చుట్టూ ప్రహరీలను ఆ సంస్థ అధికారులు మరికొంత లోపలి వైపునకు నిర్మించారు. మొక్కలు నాటడం, కాలిబాటల నిర్మాణం, ప్రహరీలు-విభాగినులపై రంగులు వేయడం, బొమ్మలు గీయడం ద్వారా విశాలంగా మారిన రహదారిని సుందరీకరించారు.

ప్రస్తుతం ఇలా..

నిమ్స్ మే ప్రహరీలను ఆనుకొని ప్రస్తుతం కాలిబాటలపై దుకాణాలు ఒక్కొక్కటిగా వెలుస్తూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టకుంటే కాలిబాటల దుకాణాలు ఇటు పోలీస్ స్టేషన్, అటు ఆటోస్టాండ్ వరకు విస్తరించే అవకాశం ఉంది. దీనివల్ల రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి విస్తరణ, సుందరీకరణ, గుడిసెవాసుల పునరావాసం వంటి కార్యక్రమాలతో కలిగిన సౌకర్యమంతా వృథాగా మారే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దుకాణాలు తొలగించాలి



శ్రీరామ్‌నగర్ నుంచి మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు నిర్మించిన ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలి. ఇప్పటికే వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. ఫుట్‌పాత్‌పై దుకాణాల వల్ల మరింత అవస్థ పెరుగుతుంది. ఫుట్‌పాత్ మొత్తం దుకాణాలు వెలవకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి.

- వినోద్ కుమార్, శ్రీరామ్‌నగర్

త్వరలోనే ప్రత్యేక డ్రైవ్

శ్రీరామ్‌నగర్-కార్మికనగర్ ప్రాంతంలో నిమ్స్ మే ప్రహరీలను ఆనుకొని కాలిబాటలపై వెలుస్తున్న దుకాణాల విషయం మా దృష్టికి వచ్చింది. పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత కారణంగా పనుల్లో జాప్యం జరుగుతుంది. బోరబండలో ఇటీవల చేపట్టిన విధంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కాలిబాటలపై వెలిసిన దుకాణాలను త్వరలోనే తొలగిస్తాం.

- ఎన్.ప్రసీద, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ

నాలా వ్యర్థాలు తొలగించరూ..


మధురానగర్ ఏ-బ్లాక్ నాలా నుంచి తీసిన వ్యర్థాలు

వెంగళరావునగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌కాలనీ మధ్య నుంచి మురుగునీటి నాలా ప్రవహిస్తోంది. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించారు. నాలుగు రోజుల క్రితం సంబంధిత విభాగం సిబ్బంది నాలా నుంచి వ్యర్థాలు తీశారు. వాటిని ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తొలగించాల్సి ఉండగా, అక్కడే పడేశారు. దీంతో స్థానికులు కూడా తమ ఇళ్లలోని వ్యర్థాలను అక్కడే పడేయడంతో వ్యర్థాలు గుట్టగా పేరుకుపోయాయి. నాలా ప్రవాహ మార్గంలోని ఏ, డీ బ్లాక్‌లలో వ్యర్థాల గుట్టలు దర్శనం ఇస్తున్నాయి. తీవ్ర దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


డి-బ్లాక్ పార్కు ఎదురుగా రహదారిపై పడేసిన వ్యర్థాలు

అనారోగ్యంతో బాలాపుర బస్తీ మాజీ అధ్యక్షుడు మృతి


నారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం

పంజాగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట బాలాపుర బస్తీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎల్లాసరి నారాయణ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ఆత్మీయ సమ్మేళనంలో యాదవ సంఘాల నాయకులు

యాదవులను బీసీ-డీ నుంచి బీసీ-బీలోకి చేర్చాలి

పంజాగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): యాదవులను బీసీ-డీ నుంచి బీసీ-బీలోకి చేర్చాలని శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఖైరతాబాద్ తుమ్మలబస్తీలో యాదవుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ పాల వ్యాపారులుగానూ, గొర్రెలు, మేకల పెంపకందారులుగానూ యాదవులు బతుకుతున్నారని అన్నారు. పశువులకు మేత కరువైందని, పశుగ్రాసం కొనలేని దీనస్థితిలో ఉన్నారని తెలిపారు. యువత కోసం నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి యాదవ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు ఓరుగంటి వెంకటేష్ యాదవ్, పేర్ని రామచందర్ యాదవ్, పి.పాండు యాదవ్, సి.వినోద్ యాదవ్, సమితి నగర అధ్యక్షుడు బి.రాజేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ యాదవ్, కోశాధికారి మమతాయాదవ్, శెట్టి ప్రదీప్, శ్రీకాంత్ యాదవ్, మాలతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

యూపీహెచ్‌సీలో సమస్యల పరిష్కారానికి కృషి

బోరబండ, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్‌నగర్ పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యం కోసం వచ్చిన మహిళలను పలకరించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవనీత్, సీనియర్ డాక్టర్ రమాదేవి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పికెల్‌బాల్ విజేత రిషభ్-భాస్కర్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏవీకే పికెల్‌బాల్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో రిషబ్ కుమార్-భాస్కర్ ద్వయం విజేతగా నిలిచింది. రెండ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు సోమవారం ముగిశాయి. అమెచ్యూర్ తెలంగాణ పికెల్‌బాల్ అసోసియేషన్ (ఏటీపీఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మహిళల డబుల్స్‌లో అనీష-దీప్తి జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో రౌనక్-జీనా జంట టైటిళ్లు దక్కించుకున్నారు. విజేతలకు ఏటీపీఏ కార్యదర్శి జగన్‌మోహన్‌గౌడ్, ఉపాధ్యక్షు లు సుచరిత, ఏవీకే పికెల్‌బాల్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి వెంకట్ పతకాలు ప్రదానం చేశారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

బోరబండ, మే 12 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ స్వరాజ్యనగర్ హరిహరక్షేత్ర దేవస్థానంలో మూడురోజుల నుంచి జరుగుతున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

- ఎమ్మెల్యే తలసాని


గర్భిణుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే సంవత్సరం నియోజకవర్గస్థాయిలో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం అమీర్‌పేట డీకే రోడ్డులోని అతిథి ఇన్ హోటల్‌లో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 120 మంది గర్భిణులకు చీరలు, గాజులు, పసుపు, కుంకుమ, పూలు, స్వీట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, రోజారెడ్డిని అభినందించారు. అమ్మ ప్రేమ వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, నాగలక్ష్మి, పుష్పలత, స్వాతి, కావేరి, లలిత పాల్గొన్నారు.

నాలా పనులకు అడ్డంకులను తొలగించాలి

నాలా పనులకు ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే తలసాని అధికారులను ఆదేశించారు. గాయత్రినగర్‌లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో బాక్స్ డ్రైన్ నిర్మాణం కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేయించానని ఎమ్మెల్యే తెలిపారు. కాగా, నిర్మాణ పనులకు పలు ఆవాంతరాలు ఏర్పడుతుండడంతో తలసాని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించారు. దీంతో పనులు ముగింపు దశకు చేరాయి. బాక్స్ డ్రైన్ జరిగే ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అడ్డంగా ఉండడంతో ఆ ప్రాంతాల్లో మాత్రమే పనులు నిలిచిపోయాయి. ఈ పనులు పూర్తయితే ముంపు సమస్య ఉండదని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డీసీ రజనీకాంత్, ఈఈ వెంకటేశ్వర్లు, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఏఈ మౌనిక, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యదుద్దీన్, జ్యోత్స్న, అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గోపీలాల్ చౌహాన్, బాబా గౌడ్ పాల్గొన్నారు.

మురికివాడల్లోని దళితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వండి

ఖైరతాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇప్పటికీ దళితవాడల్లో చాలామంది నిరుపేదలు ఇళ్లు లేక మురికివాడల్లో నివసిస్తున్నారని, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు కోరారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు సమితి హైదరాబాద్ అధ్యక్షుడు అరుట్ల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జేరిపోతుల కుమార్ వినతిపత్రం అందజేశారు. అద్దెలు చెల్లించలేక ఎంతోమంది దళితులు నోటిఫైడ్ మురికివాడల్లో నివసిస్తున్నారని, కొందరు గుడిసెలు, తాత్కాలిక షెడ్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ నెలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.


హైదరాబాద్ జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు

సీసీ రోడ్డు పనులు పూర్తి చేయించండి


ఖైరతాబాద్ డీసీకి వినతిపత్రం ఇస్తున్న కృష్ణ యాదవ్, మహేందర్‌బాబు తదితరులు

ఖైరతాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మహాకాళి ఆలయం నుంచి రైల్వేగేటు వరకు, ఖైరతాబాద్ భారీ గణపతి నుంచి ప్రభుత్వ ముద్రణాలయం వరకు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వైట్ టాపింగ్ సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేత మహేందర్‌బాబు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజు, ఎం.గంగాధర్ యాదవ్, ఎ.రాజు యాదవ్, విశాల్‌బాబు, రతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శత్రువుల దాడులను తిప్పికొట్టాలి

యూసుఫ్‌గూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): శత్రువుల దాడులను సమయస్ఫూర్తితో తిప్పికొట్టి, అత్యవసర పరిస్థితిలో తనుకు తాను రక్షణ చేసుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పరమేశ్వరమ్మ అన్నారు. మే 3 నుంచి 12వ తేదీ వరకు 4వ బెటాలియన్ క్యాంపు కమాండెంట్ ఆధ్వర్యంలో నాచారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 388వ ఎన్‌సీసీ క్యాంపు జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఎన్‌సీసీ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్‌ను ఆమె సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ వారికి ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


రైఫిల్ గురించి వివరిస్తున్న ఆర్మీ అధికారి


క్రీడా సామగ్రిని అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను యువ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. సోమవారం యువతకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.


నాయిని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

నాయిని సేవలు మరువలేం

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ నేత, మాజీ హోంమంత్రి స్వర్గీయ నాయిని నర్సింహారెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేమని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. నాయిని జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వెంగళరావునగర్ జీటీఎస్ కాలనీలోని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ)లో సభ్యుడిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన కె.రఘు కు శుభాకాంక్షలు చెబుతున్న విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ పి.అంజయ్య, స్టేట్ ప్రెసిడెంట్ ఎన్.అశోక్, నాషర్ షరీఫ్, కొరడాల వెంకటేశ్వర్లు, అనిల్, పరమేష్, మురళయ్య తదితరులు

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి


అమీర్‌పేటలో వాకథాన్ నిర్వహిస్తున్న నర్సులు

వైద్యం అందించడంలో నర్సుల పాత్ర కీలకం

అమీర్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్యం అందించడంలో నర్సుల పాత్ర కీలకమని, వారు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా.. 'మనం కలిసి సాయం చేద్దాం' అనే థీమ్‌తో అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నర్సులు వాకథాన్ నిర్వహించారు. అంతర్జాతీయ నర్సింగ్ డేను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి నుంచి పలు వీధుల్లో కొనసాగిన వాకథాన్‌లో ఆస్పత్రికి చెందిన 60 మందికి పైగా నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్ లిండమోల్ జాయ్ పాల్గొన్నారు.

స్నేహితుడి భార్యపై లైంగికదాడికి యత్నం

- తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు

అమీర్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): స్నేహానికి ద్రోహం చేశాడు. మిత్రుడి భార్యపై కన్నేశాడు. కోరిక తీర్చాలంటూ వేధింపులకు పాల్పడ్డాడు. భర్త లేని సమయంలో ఇంట్లోకి చొరబడి యువతిపై లైంగికదాడికి యత్నించాడు. అతడిని ప్రతిఘటించి తప్పించుకుని ఎస్.ఆర్.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది ఆ యువతి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేటలో నివాసం ఉంటున్న వివాహిత(27) భర్త గతంలో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేసేవాడు. అతడికి పసుపులేటి వెంకటనరసింహారావు(30) అలియాస్ పీవీ అనే స్నేహితుడు ఉన్నాడు. ఐదేళ్లుగా పనిచేసే ఉద్యోగాన్ని మానిపించి స్నేహితుడికి తన సొంత సంస్థ అయిన లోన్ వాలా డాట్ కామ్‌లో ఉద్యోగమిచ్చాడు పీవీ. అప్పటి నుంచి స్నేహితుడి భార్యపై కన్నేశాడు. ఆమె ఫోన్‌కు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ కోరిక తీర్చాలని వేధించేవాడు. ఇతడి ప్రవర్తన నచ్చక వివాహిత భర్త సంవత్సర కాలం పని మానేసి మరో సంస్థలో చేరాడు. ఆదివారం మధ్యాహ్నం స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో చొరబడి భార్యపై లైంగికదాడికి యత్నించి వేధింపులకు గురిచేశాడు. తాను గర్భవతి అని చెప్పినప్పటికీ లైంగికదాడికి యత్నించాడంటూ బాధితురాలు ఆదివారం ఎస్.ఆర్.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆచూకీ చెప్పండి.. పారితోషికం తీసుకోండి


నిందితుడు

ఖైరతాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి రెండు దొంగతనం కేసుల్లో నిందితుడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌బీటీనగర్‌లో మెకానిక్ వద్ద ఉన్న ఓ కారును దొంగిలించాడు. అదే కారులో వచ్చి ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో నర్సమ్మ మెడలోంచి రెండున్నర తులాల బంగారు గొలుసును చోరీ చేశాడు. పోలీసులకు చిక్కకుండా నెల రోజులుగా తప్పించుకు తిరుగుతున్న 55 నుంచి 60 సంవత్సరాల వయసున్న ఈ వ్యక్తి ఆచూకీ ఎవరైనా చెప్తే వారికి నగదు పురస్కారం అందజేస్తామని ఖైరతాబాద్ డీఐ సైదులు తెలిపారు. ఇతడు ఇటీవలే బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రికి వచ్చాడని, ఆచూకీ తెలిస్తే ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లోగాని, డీఐ సైదులు ఫోన్ 8712661532కు గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

బోరబండ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఊరికి వెళ్తున్నానని చెప్పి బయలుదేరిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ స్వప్నారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌లో నివసించే సాగిరాజు సత్యనారాయణరాజు(73) ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు కుమారుడు రాజేష్ పెళ్లి సంబంధం కోసం స్వగ్రామమైన తాడేపల్లిగూడెం మాధవరం గ్రామానికి ఇంటి నుంచి బయలుదేరాడు. మూడు గంటల తర్వాత భార్య నాగమణి ఫోన్ చేస్తే రాత్రి 10 గంటల వరకు విజయవాడకు చేరుకుంటానని తెలిపాడు. ఆ తర్వాత పలుమార్లు ఫోన్ చేసినా కలవడం లేదు. కంగారు పడిన ఆమె మాధవరంలోని బంధువులకు ఫోన్ చేయగా సత్యనారాయణరాజు రాలేదని చెప్పారు. దీంతో ఆమె బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాంధీలో దివిస్ లాబొరేటరి లిమిటెడ్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి

'గాంధీ'లో వాటర్ కేంద్రం ప్రారంభం

అడ్డగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. దివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద (సుజలాం సేఫ్ డ్రింకింగ్ వాటర్) రూ.72.36 లక్షలతో ఆస్పత్రిలో 23 చోట్ల వాటర్ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రోగులతో పాటు సహాయకులు ఎవరూ కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో నీటి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, సుబోధ్, ఆర్ఎంఓ 1 డాక్టర్ శేషాద్రి, కళ్యాణ చక్రవర్తి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రజిని, ఆర్ఎంఓలు వైద్యులు సుధీర్, యోగి, సరిత, నవీన్‌లు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర

అడ్డగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి) : వైద్యరంగంలో ఫోరెన్సిక్ ముఖ్యమైన విభాగమని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఇందిర సూచించారు. ఫోరెన్సిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిరంగాల్లో వైద్య రంగం గొప్పదని అందులో ఫోరెన్సిక్ విభాగం ఎంతో గొప్పదని సూచించారు. అలాగే మెడికల్ కాలేజీలో పదవి విరమణ పొందిన ప్రొఫెసర్లు రవీందర్‌రెడ్డి, దామోదర్‌లకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి, ఫోరెన్సిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ కృపాల్ సింగ్, గాంధీ ఆస్పత్రి ఆర్ఎంఓ 1 డాక్టర్ శేషాద్రి, ఫోరెన్సిక్ వైద్యులు ప్రొఫెసర్లు వసంత్ నాయక్, వెంకటనాగరాజు, సురజ్, లక్ష్మీకాంత్ రెడ్డి, సందీప్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నరసింహన్ కన్నన్, అరవింద్

భూ లక్ష్మమ్మ దేవాలయంలో అన్నదానం

తిరుమలగిరి మే 12 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్ లోని భూలక్ష్మమ్మ దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చన, అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పూర్ణచందర్, సతీష్, కన్న, గాంధీ, శ్యామ్, సుమన్, తరుణ్, ఉదయిణి, ప్రగతి, పద్మలు పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

అడ్డగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి) : రోగులకు ఇరవై నాలుగు గంటలు సేవలు చేస్తున్న నర్సుల సేవకు మారుపేరుగా నిలిచే పవిత్రమైన వృత్తి నర్సు ఉద్యోగమేనని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవ సందర్భంగా గాంధీ ఆస్పత్రిలో సోమవారం ఫ్లోరెన్స్ నైటింగెల్ జయంతి సందర్భంగా వేడుకలు జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి సూపరింటెండెంట్ పూలమాలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో గాంధీ ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి, గ్యాస్ట్రో ఎంటమాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్టెల్లా మేరీ, విద్యావతిలతో పాటు సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



బోయినపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నమాచార్య కీర్తనలు పాడుతున్న భక్తులు

ఘనంగా అన్నమయ్య జయంతి

బోయినపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి న్యూ సిటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నమయ్య జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని కల్యాణ మండపంలో వాసవీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనల కచేరి నిర్వహించారు. ఉమా, రమణ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో ఈ బృందం పాడిన అన్నమయ్య కీర్తనలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ఆయన సతీమణి విద్యావతి పాల్గొని బృందం సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

- భయాందోళనలో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు





పుల్లారెడ్డి బంగ్లా ముందు కంకర తేలిన రోడ్డు

ఈ రోడ్లు డేంజర్!

బోయినపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారుల గుండా ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉన్నా సంబంధిత కంటోన్మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 1వ వార్డు, 6వార్డుల్లోని ప్రధాన రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారాయి. వందల కొద్ది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. తాడ్‌బండ్ చౌరస్తా నుంచి సెంటర్ పాయింట్, సీతారంపురంకు, మహాత్మానగర్ రాంగోపాల్ ఎన్‌క్లేవ్, పుల్లారెడ్డి బంగ్లా ముందు ఉన్న రహదారులతో పాటు పలుచోట్ల అదేవిధంగా ఉన్నాయి. 1వ వార్డులోని న్యూ సిటీ కాలనీ రోడ్, సంచారపురి కాలనీ, సెవెన్ టెంపుల్, తోకట్ల మూల మలుపుల వద్ద ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ దారులు డేంజర్‌గా మారింది. వీధిలైట్లు సరిగ్గా లేకపోవడంతో వాహనదారులకు గుంతలు కనిపించకపోవడం కూడా ప్రమాదాలకు ఓ కారణమని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా అప్పుడప్పుడు కురుస్తున్న చిన్న వర్షాలకు రోడ్లపైన ఉన్న గుంతల్లో వర్షం నీరు నిలిచి, అవి మరింత పెద్దవిగా తయారవుతున్నాయి. గుంతలను గమనించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం వేలకొద్ది వాహనాల రాకపోకలు సాగే ఈ దారుల్లో పెద్ద గుంతలు ఏర్పడినా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవరిస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి



మహాత్మానగర్ రాంగోపాల్ ఎన్‌క్లేవ్ ప్రధాన రహదారి దుస్థితి

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ప్రధాన రహదారుల్లో లక్షలు ఖర్చు పెట్టి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ విషయం మాత్రం అధికారులు అదమరిచారు. దీంతో 1వ వార్డు, 6వ వార్డుల్లో ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. ముఖ్యంగా సీతారంపురం, సంచారపురి కాలనీ, బోయినపల్లి నుంచి సుచిత్ర సర్కిల్‌కు వెళ్లే మిలిటరీ రోడ్డు, డైరీఫార రోడ్‌లో ఈ సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సీతారాంపురం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మహంకాళి ఏసీపీ సైదయ్య





అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను ప్రదర్శిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

రాంగోపాల్‌పేట్, మే 12 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవిస్తుంటాయని, ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండి వెంటనే స్పందించాలని మహంకాళి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.సైదయ్య అన్నారు. సోమవారం మహంకాళి డివిజన్ పరిధిలోని రాంగోపాల్‌పేట్, మహంకాళి, మోండా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వ్యాపారస్తులు, వారి సిబ్బందికి పీజీ రోడ్డులోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం భవనంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా స్పందించాలో అగ్ని మాపక సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సైదయ్య మాట్లాడుతూ.. ప్రతి వ్యాపారస్తులు వ్యాపార సముదాయంలో అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిబ్బందికి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలో, ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేయాల్సిన అవసరం ప్రతి వ్యాపారిపై ఉందన్నారు.

అనంతరం అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ సిలెండర్ నుంచి మంటలు వస్తే ఎలా వాటిని ఆర్పాలి, ఇతర అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఏవిధంగా స్పందించాలి, మంటల వ్యాప్తి పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలను ప్రదర్శించారు. ఈ అవగాహన కార్యక్రమంలో మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్, రాంగోపాల్‌పేట్ డీఐ, అగ్నిమాపక అధికారి శంకర్, ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని వ్యాపారస్తులు, ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

చర్లపల్లికి వెళ్లే బస్ పాయింట్ ఎక్కడ..?

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముందు నుంచి లేని బస్సులు
- 500మీ. నడవాల్సి వస్తుందంటూ ప్రయాణికుల ఆందోళన

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు ఉదయం ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగిన ప్రయాణికులు చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు 500 మీటర్లు నడిచి బ్లూసీ హోటల్ పాయింట్ వద్ద 250సి (సికింద్రాబాద్- చర్లపల్లి) బస్సు ఎక్కాల్సి వస్తుందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల నుంచి ప్రతిరోజు నగరానికి వస్తూ ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్న కొంతమంది ఉదయం చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ఉదయం 4.25 నిమిషాల నుంచి 250సి రూట్‌లో గ్రేటర్ ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని చెబుతున్నా అవి ఏ పాయింట్ నుంచి ప్రారంభమవుతాయో చెప్పకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. చర్లపల్లికి బస్సులు నడుపుతున్నామని చెబుతున్న ఆర్టీసీ అధికారులు బస్సులు ఎక్కడనుంచి నడుపుతున్నారనే సమాచారం తెలిపే బోర్డులు ఏర్పాటు చేయలేదని చెబుతున్నారు. రోజూ ప్రయాణాలు సాగించేవారు బస్సుల సమాచారం తెలియక అసౌకర్యానికి గురవుతున్నారు. సికింద్రాబాద్ నుంచి చర్లపల్లికి కేవలం ఆర్డినరీ బస్సులు మాత్రమే నడుపుతున్నారని మెట్రో లగ్జరీ, డీలక్స్ బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఉదయం 6-8 గంటల సమయంలో చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు బస్సులు రావడం లేదంటూ కొంతమంది ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముందు నేరుగా బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సి.సంతోష్ యాదవ్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మారేడుపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి హిందూ శ్మశాన వాటికలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పూర్తి చేయాలని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోష్ యాదవ్ సోమవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి ఇవే సమస్యల గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శ్మశాన వాటికలో పెండింగ్‌లో ఉన్న సమస్యలతో పాటు రోడ్లు వేయాలని అధికారులను తన సిఫార్సు లేఖతో ఆదేశించారు. అంతర్గత రోడ్లు వేయాలని, శ్మశాన వాటికలో ఆఫీస్ కార్యాలయం పూర్తి చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

క్రైమ్ కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బోయినపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : హీరో బైక్ షోరూం ముందు ఉన్న ఓ దుకాణం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం రాత్రి బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్ తెలిపిన వివరాల ప్రకారం తాడ్‌బండ్ వద్ద హీరో బైక్ షోరూమ్ ముందు హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన గుర్తుతెలియని(55) వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించి, చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే బోయినపల్లి పోలీసులకు 8712572075 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఊరెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ ప్రయాణికుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ జంగల్ ద్రుమ గ్రామానికి చెందిన జీనాక్ (39) పెయింటర్. ఉత్తర ప్రదేశ్‌కు వెళ్లడానికి సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చి పడుకున్నాడు. నిద్రలోనే చనిపోవడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మరణించాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి జేబులో ఆధార్ కార్డు, కొన్ని సెల్ నంబర్ల ఆధారంగా బంధువులకు సమాచారం ఇవ్వగా, వారు గాంధీ మార్చురీకి చేరుకున్నారు. పోస్టుమార్టం పూర్తి కాగానే మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత కారణాల కారణంగా ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొల్లారం రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం రైల్వే యార్డు ఆఫ్‌లైన్ సమీపంలో గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, బహుశా వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 8712658581 నంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ.. మహిళలకు గాయాలు

- ఇరు వర్గాలపై కేసు నమోదు చేసిన బోయినపల్లి పోలీసులు

బోయినపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి బాపూజీనగర్‌లో కొన్ని రోజులుగా రెండు కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవలు తీవ్రస్థాయికి చేరుకుని దాడుల వరకు దారి తీశాయి. ఈ ఘర్షణలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలకు తీవ్ర గాయలయ్యాయి. కాగా ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్ఐ గిరిధర్‌లు తెలిపిన వివరాల ప్రకారం న్యూ బోయినపల్లి బాపూజీ నగర్‌కు చెందిన సంపత్ అనే వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడి ఇంటి వెనకాల ఉండే ఇంటిలోకి వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు యువకులు తరచుగా వస్తూ గోల చేస్తుండటంతో సంపత్‌తో పాటు, అతని తల్లి పుష్ప ఆ యువకులను పలుమార్లు వారించారు. ఇదే విషయమై స్థానికంగా నివసించే గోమతి అనే మహిళకు పుష్పకు ఈ నెల 3న గొడవ జరిగింది. ఈ క్రమంలోనే పుష్పను గోమతి దుర్భాషలాడే వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బస్తీ పెద్దలు కలుగచేసుకుని ఇరు కుటుంబాలకు సర్ది చెప్పారు. అయితే 11వ తేదీ రాత్రి సంపత్ తనపై ఏవో అసభ్యకర మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపిస్తూ గోమతి, ఆమె బంధువులు వంశి, సూర్య, జ్ఞానేశ్వర్‌లతో పాటు, మరికొందరు సంపత్ ఇంటిపై రాళ్లతో దాడికి దిగారని, ఈ దాడిలో పుష్పతో పాటు, సంపత్ భార్య శ్వేత తలలకు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. గాయాలపాలైన పుష్ప, శ్వేతలను స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, తమకు సమాచారం అందించారని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై ఇరు వర్గాలు ఫిర్యాదులు చేయడంతో, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా సీపీ దృష్టికి తీసుకువెళ్లిన మన్నె క్రిశాంక్ కాగా రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ గాయాల పాలైన పుష్ప, శ్వేతల ఫోటోలను జత చేసి సమస్యను సామాజిక మాధ్యమం ద్వారా నగర పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

బుద్ధ భగవానుని బోధనలు ఆచరణీయం



పుస్తకావిష్కరణలో మేకపాటి రాజమోహన్ తదితరులు



ప్రత్యేక ప్రార్థనల్లో బౌద్ధ భిక్షువులు

- మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మారేడుపలి/చిలకలగూడ, మే 12(ఆంధ్రజ్యోతి): శాంతి ప్రదాత బుద్ధ భగవానుని బోధనలు నేటికీ ఆచరణీయమని మాజీ పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్, మారేడుపల్లి, మహేంద్రహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్‌లో బుద్ధుడి 2569వ జయంతిని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేకపాటి మాట్లాడుతూ దేశంలో వేయి సంవత్సరాలు బౌద్ధం సుస్థిరంగా ఉందని, తెలుగు రాష్ట్రాల్లో బౌద్ధం సుస్థిర పరచటానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని, ప్రపంచంలో శాంతి ప్రబలటానికి ఆయన చేసిన బోధనలు ఉపయుక్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. చీఫ్ ప్యాట్రన్ బుద్ధవిహార్, ఆధ్యాత్మికవేత్త అంజనేయరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించిన నిధులతో ఇక్కడ 30 గదుల నిర్మాణం త్వరలో పూర్తవుతుందని, వైజాగ్‌లో బుద్ధ విహార్ ధ్యాన మందిర నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతాన్నాయని, నిజామాబాద్, తణుకుల్లో విహారాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా విశాఖలో బుద్ధ విహార్ నిర్మాణానికి రూ.3.87కోట్ల విరాళం అందజేసిన మేకపాటికి ధన్యవాదాలు తెలిపారు.

జె.లక్ష్మీరెడ్డి ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువదించిన బుద్ధుడు ఆయన అనుయాయులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురూజీ వినయ్ రక్షిత్, విభిన్న ప్రాంతాల నుంచి తరలి వచ్చిన బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి



సికింద్రాబాద్‌లోని మహాబోధి బుద్ధవిహార్‌లో ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ సన్యాసులు



2569 బుద్ధ జయంతి సందర్భంగా మహేంద్రహిల్స్‌లో ప్రార్థనలు